సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023



ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

గరిష్టం/కనిష్టం
29.0/18.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. వేకువజామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది.

ఓటెత్తారు







బేల మండలకేంద్రంలో బారులు తీరిన ఓటర్లు..



ఓటేశాం..: సిరా చుక్క చూపుతూ..

ఫొటోలు..: - సాక్షి ఫొటోగ్రాఫర్



- చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం
- స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకున్న ఈవీఎంలు
- ఈనెల 3న టీటీడీసీలో ఓట్ల లెక్కింపు
- ఓటేసేందుకు వచ్చి ఇద్దరు మృతి
- గొల్లఘాట్‌లో ఎన్నికల బహిష్కరణ



బ్యాలెట్ బాక్స్‌లతో టీటీడీసీలోని స్ట్రాంగ్‌రూంకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది

జిల్లాలో పోలింగ్ శాతం.. (గతంలో, ఈసారి)

సంవత్సరం	పోలింగ్ శాతం
2023	79.85
2018	83.34

నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్ల శాతం..

నియోజకవర్గం	2023లో.. (5గంటల తర్వాత కలిపి)	2018లో
ఆదిలాబాద్	77.20	81.64
బోథ్	82.93	85.29

సాక్షి, ఆదిలాబాద్: ఈవీఎంలలో అభ్యర్థుల భవిత నిక్షిప్తమైంది. ఇక గెలిచేదెవరో.. ఓడేదెవరో.. ఈనెల 3న తేలిపోతుంది. అప్పటివరకు ఉత్కంఠ తప్పదు. శాసనసభ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ గురువారం నిర్వహించారు. జిల్లాలో చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల్లోపు కేంద్రాలకు చేరుకున్న ఓటర్లను లోనికి అనుమతించి గేట్లు వేసేశారు. రాత్రి వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. మొత్తంగా 79.85 శాతంగా నమోదైంది.

రాత్రి వరకు..

జిల్లాలో మొత్తం 592 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ మొదలైంది. మధ్యాహ్నం ఒంటిగంట వరకు 40 శాతానికి పైగా నమోదైంది. ఆ తర్వాత 5 గంటల వరకు మరో 30 శాతానికి పైగా పెరిగింది. అప్పటికే కేంద్రాలకు చేరుకున్న వారికి ఓటు వేసేందుకు అవకాశం ఇచ్చారు. తుది పోలింగ్ శాతం 79.85కి చేరుకుంది. ఇదిలా ఉంటే పోలింగ్ పూర్తయిన ఆయా కేంద్రాల నుంచి ఈవీఎంలను జిల్లా కేంద్రంలోని టీటీడీసీ స్ట్రాంగ్ రూమ్‌కు ఎస్కార్ట్ సాయంతో ప్రత్యేక వాహనాల్లో తరలించారు. రాత్రి వరకు అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి ఇవి చేరుకున్నాయి. కలెక్టర్ రాహుల్‌రాజ్ వాటిని పరిశీలించారు.

3న లెక్కింపు..

ఈ నెల 3న జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో ఓట్ల లెక్కింపు జరగనుంది. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపును ఆ రోజు చేపడతారు. స్ట్రాంగ్ రూమ్‌కు తగిన భద్రత కల్పించారు. ఇక ఫలితాలపై అందరి ఆసక్తి నెలకొంది. రాష్ట్రంలో వివిధ సంస్థల సర్వే రిపోర్టులు వస్తుండడంతో అందరు ఆసక్తిగా గమనిస్తున్నారు. జిల్లాలోని నియోజకవర్గ ఫలితాలు ఎలా ఉంటాయోనని చర్చించుకుంటున్నారు.

ఎన్నికలను బహిష్కరించిన గ్రామస్తులు..

భీంపూర్ మండలం గొల్లఘాట్ గ్రామంలో పోలింగ్ నిలిచిపోయింది. గ్రామస్తులు ఎన్నికల్లో పాల్గొనలేదు. రోడ్డు సౌకర్యంతో పాటు తాగునీటి సమస్య పరిష్కరించాలని, అలాగే ఇతర వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ నారాయణ, సీఐ నరేశ్ గ్రామస్తుల వద్దకు చేరుకున్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. అయితే కలెక్టర్ ఇక్కడికి వచ్చి చెబితేనే ఓటు వేస్తామని వారి భీష్మించుకుని కూర్చున్నారు. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ సిబ్బంది వేచిచూసినప్పటికీ వారు ఎవరు ఓటు వేయలేదు. గ్రామంలో 277 ఓట్లు ఉండగా, ఒక్క ఓటు కూడా పోల్ కాకపోవడం గమనార్హం. అలాగే బజార్‌హత్నూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో పోలింగ్‌ను మొదట గ్రామస్తులు బహిష్కరించారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఓటు వేయమని స్పష్టం చేశారు. తహసీల్దార్ శంకర్ జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్‌తో మాట్లాడించగా, రోడ్డు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. దీంతో వారు అరగంట ఆలస్యంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. గ్రామంలో 180 ఓట్లకు గాను 154 మంది ఓటు వేశారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని కేంద్రంలో పోలింగ్ మందకొడిగా సాగడంతో ఓటర్లు క్యూలో చాలా సేపు నిలిచి ఉండడంతో అసహనానికి గురయ్యారు. దీంతో ఓటర్ల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అక్కడికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు.

ఓటు వేసేందుకు వచ్చి ఇద్దరు మృతి

ఓటు వేసేందుకు వచ్చి జిల్లాలో ఇద్దరు వృద్ధులు మృతిచెందారు. జిల్లా కేంద్రంలోని ఖుర్షాపూర్ కాలనీకి చెందిన చంద్రగిరి రాజన్న (65) ఓటు వేసేందుకు స్థానిక బాలికల హైస్కూల్‌కు వచ్చారు. క్యూలైన్‌లో ఉన్నప్పుడు కింద పడిపోవడంతో రిమ్స్‌కు తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అలాగే మావల మండల కేంద్రానికి చెందిన గంగమ్మ (78) మావల హైస్కూల్‌లో ఓటు వేసేందుకు వచ్చారు. లైన్‌లో ఉన్నప్పుడు పిట్స్ రావడంతో రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె మృతిచెందారు.

ప్రారంభం నుంచి జోరుగానే..

కైలాస్‌నగర్: జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి ముగిసేదాకా జోరుగానే సాగింది. ఓటు హక్కు వినియోగంపై యంత్రాంగం నిర్వహించిన 'స్వీప్' ప్రచారానికి ఓటర్లు స్పందించారు. కొత్తగా ఓటు హక్కు పొందిన యువత ఓటు వేసేందుకు ఆసక్తి కనబర్చారు. ఉదయం నుంచే ఆయా కేంద్రాల వద్ద బారులు తీరారు. జిల్లాలో సాయంత్రం ఐదు గంటల వరకు అందిన వివరాల ప్రకారం 73శాతం పోలింగ్ నమోదైంది. సమయం ముగిసినా ఇంకా కేంద్రాల్లో ఓటర్లు క్యూలో ఉండటంతో అధికారులు వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. దీంతో పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశముంది. గత ఎన్నికలతో పోల్చితే ఈ సారి పోలింగ్ శాతం ఎక్కువగానే నమోదైనట్లుగా అధికారులు భావిస్తున్నారు.

పోలింగ్ సరళి సాగిందిలా..

జిల్లా యంత్రాంగం ప్రతి రెండు గంటలకోసారి పోలింగ్ శాతం ప్రకటించింది. ఉదయం ఏడు గంటలకు ప్రారంభం కాగా 9గంటలకు అప్పటి వరకు అయిన పోలింగ్ శాతం ప్రకటించారు. రెండు నియోజకవర్గాల పరిధిలో 13 శాతం నమోదవ్వగా 11గంటలకు ఆదిలాబాద్ నియోజకవర్గంలో 15.36 శాతం, బోథ్‌లో 19.2 శాతం పెరిగింది. ఒంటి గంట వరకు ఆదిలాబాద్‌లో కొంత నెమ్మదిగా సాగింది. రెండు గంటల వ్యవధిలో కేవలం 10.9 శాతం పోలింగ్ జరిగితే బోథ్‌లో మాత్రం జోరు తగ్గలేదు. 18.4 శాతం నమోదైంది. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 3గంటల వరకు ఓటర్లు తరలిరావడంతో మళ్లీ పోలింగ్ శాతం పెరిగింది. 22.92 శాతం నమోదు కాగా, బోథ్‌లో కాస్త తగ్గి 17.61శాతం నమోదైంది. సాయంత్రం పోలింగ్ ముగిసే సమయం ఐదు గంటల వరకు ఆదిలాబాద్ నియోజకవర్గంలో పోలింగ్ శాతం కాస్త నెమ్మదించింది. 8.9 శాతం అదనంగా నమోదైంది. బోథ్ నియోజకవర్గంలోనూ 13.86శాతంగా నమోదైంది.

ఎడ్లబండిపై వెళ్లి ..



ఎడ్లబండిపై ఓటు వేసేందుకు వెళ్తున్న గిరిజనులు

తాంసి: గ్రామంలో పోలింగ్ కేంద్రం లేకపోవడంతో ఎడ్లబండిపై వెళ్లి ఓటు వేసి గిరిజనులు ఆదర్శంగా నిలిచారు. ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం తాంసి మండలం అంబుగాం గ్రామ పంచాయతీ పరిధి వామన్‌నగర్‌కు చెందిన ఓటర్లు గ్రామ సమీపంలో ఉన్న అంబుగాం గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేయాల్సి ఉంటుంది. కాగా గ్రామం నుంచి సరైన వాహన సౌకర్యం లేక గ్రామానికి చెందిన రమేష్ తన కుటుంబసభ్యులతో కలిసి పోలింగ్ కేంద్రానికి ఎడ్లబండిపై వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

సైకిల్‌పై 28కిలోమీటర్లు..

తాంసి: భీంపూర్ మండలం వడూర్ గ్రామానికి చెందిన కావటి రామన్న గురువారం జరిగిన ఎన్నికల్లో సైకిల్‌పై వచ్చి ఓటు వేశాడు. వడూర్ గ్రామానికి చెందిన రామన్న కుష్టు వ్యాధి సోకడంతో జిల్లా కేంద్రంలోని లెప్రసీ కాలనీల్లో ఉంటున్నాడు. కాగా ఎన్నికల్లో ఓటు వేసేందుకు జిల్లా కేంద్రం నుంచి వడూర్ గ్రామానికి 28 కిలోమీటర్లకు పైగా సైకిల్‌పై వెళ్లి ఓటు హక్కు వినియోగించుకున్నాడు.



సైకిల్‌పై వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్న రామన్న

సుదూరం ప్రయాణించి..



ఢిల్లీ నుంచి వచ్చి ఓటేసిన న్యూరో సర్జన్ డాక్టర్ రాహుల్ రాథోడ్

గుడిహత్నూర్: తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి కొంతమంది సుదూర ప్రయాణం చేసి వచ్చారు. గుడిహత్నూర్ మండల కేంద్రానికి చెందిన డాక్టర్ రాహుల్ రాథోడ్ న్యూఢిల్లీలో న్యూరో సర్జన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గాంతుల నరేష్ జార్ఖండ్‌లోని ఓ ఎన్‌జీవోలో జిల్లా అధికారిగా పని చేస్తున్నారు. చాటే దీపక్ కర్ణాటకలో బ్యాంకు అధికారిగా పని చేస్తున్నారు. వీరితోపాటు హైదరాబాద్‌లో వివిధ రంగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు మండలానికి చేరుకొని తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.



జార్ఖండ్ నుంచి వచ్చిన నరేశ్



కర్ణాటక నుంచి వచ్చిన దీపక్ చాటే

ఓటేసిన ప్రముఖులు



సిరా గుర్తు చూపుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్, ఆయన సతీమణి శ్రీజ





సిరాగుర్తు చూపుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్



ఓటు వేసిన అనంతరం సిరా గుర్తు చూపుతున్న జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ తదితరులు

ఆదిలాబాద్‌టౌన్: అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉన్న ఆయా పార్టీల అభ్యర్థులతో పాటు పలువురు జిల్లా అధికారులు, ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల్లో గురువారం ఓటు వేశారు. జెడ్పీ చైర్మ న్ జనార్దన్ రాథోడ్ ఉట్నూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదిలాబాద్ ప్రభుత్వ డైట్ కళాశాల పోలింగ్ కేంద్రంలో సతీమణి శ్రీజతో కలిసి ఓటు వేశారు. అలాగే ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతొ, ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి ఓటు వేశారు. బీఆర్ఎస్ ఆదిలాబాద్ నియోజకవర్గ అభ్యర్థి జోగు రామన్న తన స్వగ్రామమైన జైనథ్ మండలం దీపాయిగూడలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పోలింగ్ కేంద్రంలో, కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి కొలాం ఆశ్రమ పాఠశాలలో ఓటేశారు. స్వతంత్ర అభ్యర్థి సంజీవ్‌రెడ్డి తన స్వగ్రామమైన ఆదిలాబాద్‌రూరల్ మండలం పొచ్చరలో ఓటు వేశారు. ఇక బోథ్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ నేరడిగొండ మండలంలోని రాజురా గ్రామంలో, కాంగ్రెస్ అభ్యర్థి ఆడె గజేందర్ నేరడిగొండ మండలంలోని బొందిడి పోలింగ్ కేంద్రంలో, బీజేపీ అభ్యర్థి, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు బోథ్ మండలంలోని ఘన్‌పూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు బోథ్ మండల కేంద్రంలో ఓటు వేశారు. మాజీ ఎంపీ గొడం నగేష్ బజార్‌హత్నూర్ మండలంలోని జాతర్లలో ఓటు వేశారు. వీరితో పాటు జిల్లా అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ఆదిలాబాద్ పట్టణంలోని షాదీఖానాలో వినియోగించుకున్నారు.

నిఘా నీడలో పోలింగ్

- కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

ఆదిలాబాద్‌టౌన్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం నిఘా నీడలో సాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద బీఎస్ఎఫ్ బలగాలను మోహరించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగగా, అనంతరం ఈవీఎంలను జిల్లా కేంద్రంలోని టీటీడీసీకి తరలించేంత వరకు బందోబస్తు కొనసాగించారు. ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి జిల్లా కేంద్రంలోని పలు కేంద్రాలను పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో గొడవ సమాచారం తెలుసుకున్న ఎస్పీ అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఆందోళనకారులను సముదాయించి పోలింగ్ ప్రక్రియ సాఫీగా సాగేలా చూశారు. సజావుగా ముగియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. టీటీడీసీలోని స్ట్రాంగ్ రూమ్ వద్ద ప్రత్యేక బలగాలు, పోలీసు సిబ్బందితో పహారా నిర్వహిస్తున్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.



ఓటర్లను సముదాయిస్తున్న ఎస్పీ

పోలింగ్ కేంద్రంలో తోపులాట

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ భవన సముదాయంలో ఏర్పాటు చేసిన 214 పోలింగ్ కేంద్రంలో సాయంత్రం సమయంలో ఓటర్లు ఓటు వేసేందుకు పెద్ద ఎత్తున తరలి రాగా, తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. పలువురు ఓటర్లు బాహాబాహీకి దిగగా, పోలీసులు రంగ ప్రవేశం చేశారు. జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పోలింగ్ కేంద్రానికి చేరుకొని ఓటర్లను సముదాయించి, ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు. 214 పోలింగ్ కేంద్రంలో సుమారుగా రాత్రి ఏడు గంటల వరకు పోలింగ్ జరగడం గమనార్హం. మరోవైపు పోలింగ్ సమయం ముగిసిన తర్వాత కూడా బీఆర్ఎస్ నాయకులు పోలింగ్ కేంద్రం లోపలికి వెళ్తున్నారని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

దీపాయిగూడలో మొరాయించిన ఈవీఎం

జైనథ్: మండలంలోని దీపాయిగూడ గ్రామంలో 28వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించింది. గురువారం అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు వేయడానికి పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఓటర్లకు ఎదురుచూపులు తప్పలేదు. 7గంటలకు ఈవీఎం ప్రారంభించడానికి అవసరమైన సెట్టింగ్‌లు చేస్తుండగా ఈవీఎం మొరాయించినట్లు సమాచారం. దాదాపు 20నిమిషాల పాటు ఈవీఎం మొరాయించడంతో అధికారులు తలలు పట్టుకున్నారు. ఎట్టకేలకు అధికారులు ఈవీఎంను సిద్ధం చేసినప్పటికీ, పోలింగ్ మొదలైన 46నిమిషాలకు ఓటర్లను అనుమతించారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

జోగు రామన్నను అడ్డుకున్న బీజేపీ శ్రేణులు



బీఆర్ఎస్, బీజేపీ శ్రేణులను చెదరగొడుతున్న పోలీసులు

ఎదులాపురం: పోలింగ్ సరళిని పరిశీలించేందుకు పలు కేంద్రాలను సందర్శించి పరిశీలిస్తున్న తరుణంలో బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్నను బీజేపీ శ్రేణులు అడ్డుకున్నారు. పట్టణంలోని శ్రీరాంకాలనీలోని సమీకృత గిరిజన బాలికల వసతి గృహానికి చేరుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్నను అక్కడి బీజేపీ శ్రేణులు అడ్డుకున్నారు. పెద్ద ఎత్తున వ్యతిరేక నినాదాలు చేస్తూ అడ్డుకోగా అక్కడే ఉన్న పోలీసులు గమనించి వారిని నిలువరించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో బీజేపీ, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు కల్పించుకుని బీఆర్ఎస్, బీజేపీ శ్రేణులను అక్కడి నుంచి చెదరగొట్టారు. పరిస్థితి అదుపులోకి రావడంతో ఎమ్మెల్యే పోలింగ్‌స్టేషన్‌ను సందర్శించి సరళిని పరిశీలించారు.

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం



మంటలు ఆర్పుతున్న దృశ్యం

తానూరు: మండలంలోని భోసి గ్రామానికి చెందిన సబ్బన్ సాయినాథ్ అనే రైతు ఇంట్లో నిల్వ ఉంచిన పత్తి పంట షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైనట్లు బాధిత రైతు వాపోయాడు. ఆయన వివరాల ప్రకారం... రైతు సాయినాథ్ ఏరిన పత్తిని ఇంటి ఎదుట నిల్వ చేసుకున్నాడు. గురువారం మధ్యాహ్నం విద్యుత్ తీగలకు షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి పత్తికి మంటలు వ్యాపించాయి. గమనించిన కుటుంబీకులు, గ్రామస్తులు మంటలు ఆర్పేలోగా సుమారుగా రెండు క్వింటాళ్ల పత్తి పంట దగ్ధమైనట్లు తెలిపాడు.

వాగులో పడి వృద్ధురాలి మృతి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ గ్రామానికి చెందిన జంగిలి లక్ష్మీబాయి (75) వాగులో పడి బుధవారం మృతి చెందినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..యాపల్‌గూడకు చెందిన లక్ష్మీబాయి మతిస్థిమితం కోల్పోయింది. ఇదే క్రమంలో ఆమె గ్రామ శివారు ప్రాంతాంలో తిరుగుతూ వెళ్తున్న క్రమంలో ఆకస్మాత్తుగా వాగులో పడి మృతిచెందింది. గురువారం మృత్యురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తరలివచ్చి.. ఓటువేసి

ఓటు వేసే ముందు సంతకం చేస్తున్న మంత్రి ఐకేరెడ్డి



ఆదిలాబాద్‌టౌన్: ఓటువేసిన ఎమ్మెల్యే రామన్న



కుటుంబంతో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాయల్ శంకర్



సతీమణితో బీజేపీ బోథ్ అభ్యర్థి సోయం బాపూరావు





ఖానాపూర్: బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్



ఆదిలాబాద్‌టౌన్: భార్యతో కాంగ్రెస్ అభ్యర్థి



కుటుంబంతో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు



ఓటు వేసిన మహిళలు



భైంసారూరల్: కాంగ్రెస్ అభ్యర్థి నారాయణ్‌రావుపటేల్



ఓటు వేసేందుకు క్యూలో ఓటర్లు

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



ఆదిలాబాద్‌టౌన్: బీఆర్ఎస్ బోథ్ నియోజకవర్గ అభ్యర్థి అనిల్‌జాదవ్



ఖానాపూర్: ఎమ్మెల్యే రేఖానాయక్



కాంగ్రెస్ ఖానాపూర్ అభ్యర్థి బొజ్జు



ఆదిలాబాద్‌టౌన్: మాజీ ఎంపీ గొడం నగేశ్

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో గురువారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఓటును వినియోగించుకునేందుకు ఓటర్లు భారీగా తరలివచ్చారు. గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచే ఓటర్లు బారులుతీరారు. తుది సమయం ముగిసే వరకు ఓటర్లు పలు పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరారు. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ అదే తీరైన వాతావరణం కనిపించింది. యువకులు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు పోటీపడి ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ప్రతి రెండు గంటలకోసారి పోలింగ్ శాతం సరళిని ఎన్నికల అధికారులు ప్రకటించారు. - సాక్షి నెట్‌వర్క్



భైంసాటౌన్: బీజేపీ అభ్యర్థి రామారావుపటేల్



నిర్మల్ కాంగ్రెస్ అభ్యర్థి



మావలలో ఓటు వేసేందుకు క్యూలో ఓటర్లు



ఓటేసేందుకు వస్తున్న వృద్ధురాలు..



కాంగ్రెస్ బోథ్ అభ్యర్థి అడె గజేందర్



ఖానాపూర్: బీజేపీ అభ్యర్థి రమేశ్



భైంసారూరల్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



తాంసి: మొదటిసారి ఓటువేసిన యువతులు



కుటుంబీకులతో ఓటువేసిన నిర్మల్ బీజేపీ అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డి

అభివృద్ధికి తొలిఓటు

- ఓటు హక్కును వినియోగించుకున్న నూతన ఓటర్లు



ఆదిలాబాద్‌టౌన్/కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తొలిసారిగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం తమ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసేందుకు జిల్లాలోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో వరుసలో నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువ తెలుసుకుని ఓటరుగా నమోదు చేసుకున్నామని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో విద్యను అభ్యసిస్తున్నప్పటికీ ప్రయాణ ఖర్చులను లెక్కచేయకుండా ఓటుకే ప్రాధాన్యతనిచ్చామని చెప్పారు. యువత ఓట్లు కీలకమని భావించి తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకునేందుకు ఇది మంచి అవకాశంగా భావించి ఓట్లు వేశామని చెప్పారు. తొలి ఓటు వేసిన వారి అభిప్రాయాలు..

సంతోషాన్నిచ్చింది..



అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా ఓటు వేశాను. చాలా సంతోషమనిపించింది. ఆరు నెలల క్రితం ఓటరు కోసం దరఖాస్తు చేసుకున్నా. ఇటీవల ఓటు హక్కు వచ్చింది. విద్యానగర్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశాను. యువత చాలా మంది ఈసారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

– జి.కునాల్ గౌడ్, విద్యానగర్, ఆదిలాబాద్

తొలిసారి ఓటు వేశాను..



ఈసారి నాకు ఓటు హక్కు వచ్చింది. పట్టణంలోని హమీద్‌పూర కాలనీలో గల పోలింగ్ కేంద్రంలో ఓటు వేశాను. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిది. మనకి నచ్చిన నాయకుడిని ఎన్నుకునేది ఓటు ద్వారా సాధ్యం. రాజ్యాంగం కల్పించిన హక్కును వినియోగించుకోవడం ఆనందంగా ఉంది.

– ధనశ్రీ, డిగ్రీ విద్యార్థిని

ఓటు విలువ తెలిసి..



ఓటు చాలా విలువైనది. కొంత మంది ఓటు హక్కు ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా ఓటు వేయడం లేదు. తొలిసారిగా ఓటు హక్కు రావడంతో నేను ఇతర ప్రాంతంలో ఎంబీబీఎస్ చదువుతున్నప్పటికీ ఓటు వేసేందుకు ఆదిలాబాద్‌కు వచ్చాను. మా కుటుంబ సభ్యులతో కలిసి భుక్తాపూర్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశాను.

– సృష్టి, మెడికో విద్యార్థి

ఓటు నా బాధ్యత..



తొలిసారి నాకు ఓటు హక్కు వచ్చింది. ఓటు వేయడం నా బాధ్యతగా భావించాను. సరైన నాయకుడిని ఎన్నుకోవాలని కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నాను. యువత ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి.

– అనవిక, డిగ్రీ విద్యార్థిని

మొదటిసారి ఓటు హక్కు..



లక్ష్మణచాంద: తనది మండలంలోని చింతల్‌చాంద గ్రామం. తనకు ఓటు హక్కు ఇటీవలనే వచ్చింది. మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకున్నాను.

– శైలజ, చింతల్‌చాంద

సంతోషంగా ఉంది



లక్ష్మణచాంద: తనది మండలంలోని చామన్‌పెల్లి గ్రామం. తను అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయడం ఇదే మొదటిసారి కావడంతో చాలా సంతోషంగా ఉంది. నాకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేయడం ఆనందం అనిపించింది.

– వనిత, చామన్‌పెల్లి

ఉత్సాహంగా ఓటు



తాంసి: మొదటి సారి ఓటు హక్కును వినియోగించుకున్నాను. ఎంతో ఉత్సాహంగా అనిపించింది. ఉదయం నుంచే పెద్దఎత్తున యువత ఓటింగ్‌లో పాల్గొన్నారు.

– శ్రీజ, అంబుగాం

విలువను తెలిపేలా..

ఓటు హక్కు విలువను తెలిపేలా అధికారులు చేసిన ప్రచారంతో ఓటు కోసం దరఖాస్తు చేశాను. ఈ ఏడాది అక్టోబర్‌లో ప్రకటించిన ఓటర్ల జాబితాలో ఓటును పొందాను. ఈ ఎన్నికల్లో తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకోవడం సంతోషంగా ఉంది.

– చిల్కూరి దీప్తీ, ఓల్డ్ హౌజింగ్‌బోర్డు

భవిష్యత్తును మార్చే అస్త్రం..



నేను నిజామాబాద్‌లో బీడీఎస్ చదువుతున్నాను. నా తొలి ఓటు వేయాలని జిల్లా కేంద్రానికి వచ్చాను. భుక్తాపూర్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశాను. సరైన నాయకుడిని ఎన్నుకోవాలంటే ఓటే ఆయుధం. ప్రజలకు మంచి చేసే నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఓటు కల్పిస్తోంది.

– సాన్వి తాటే, బీడీఎస్ విద్యార్థి

అందుబాటులో ఉండి సేవ చేయాలి



తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకోవడం సంతోషంగా ఉంది. ఉదయమే పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేశాను. చాలా మంది వరుసలో ఉన్నప్పటికీ ఎలాంటి విసుగు రాలేదు. బాధ్యతగా భావించి ఓటు హక్కును వినియోగించుకున్నాను. రెండు మూడు రోజులుగా ఎవరికి ఓటు వేయాలని ఆలోచించి నిర్ణయం తీసుకున్నాను.

– దుర్గా, డిగ్రీ విద్యార్థిని

మంచి నేతను ఎన్నుకునే అవకాశం



ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైంది. అలాంటి వజ్రాయుధాన్ని తొలిసారిగా వినియోగించుకున్నాను. ప్రజల కోసం పనిచేసే నాయకుడిని ఓటు హక్కు వినియోగం ద్వారా ఎన్నుకునే అవకాశం కలుగుతుంది. నాకు నచ్చిన నాయకుడికి ఓటు వేయడం ఆనందంగా ఉంది.

– జే. శ్వేత, డిగ్రీ విద్యార్థిని

ఓటు బాధ్యతగా భావించాను..



ఓటు హక్కును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఇటీవల బీఎల్ఓ ద్వారా ఓటు హక్కుకు దరఖాస్తు చేశాను. ఓటు హక్కును పొంది ఈ ఎన్నికల్లో తొలిసారిగా వినియోగించుకున్నాను. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును బాధ్యతగా భావించి వినియోగించుకుంటే మంచి నాయకులను ఎన్నుకునే అవకాశం ఉంటుంది.

– కె.కౌశిక్, ఆదిలాబాద్

వాయిదా వేసుకున్న



లక్ష్మణచాంద: రెండు నెలల కిందటనే అమెరికా నుంచి లక్ష్మణచాందకు వచ్చాను. తిరిగి గురువారం వెళ్లాల్సి ఉంది. కానీ ఎన్నికలు ఉండటంతో గురువారం తాను ఓటు హక్కును వినియోగించుకోవడం కోసం తన టికెట్‌ను మరో రెండు రోజులు పోస్ట్‌పోన్ చేసుకున్నాను.

– అద్వాల స్పందన, లక్ష్మణచాంద